ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజక వర్గాలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రెండు నియోజకవర్గాలలోని అన్ని డివిజన్లలో బూత్‌ల వారిగా పార్టీ జెండాల ఆవిష్కరణ, బూత్‌లలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా, డివిజన్, బూత్ స్థాయి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


జెమినికాలనీలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు తదితరులు


బర్కత్‌పురలోని నగర కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు


గాంధీనగర్ డివిజన్‌లో పార్టీజెండాను ఆవిష్కరించిన అనంతరం టిఫిన్ బైఠక్‌లో అల్పాహారం తీసుకుంటున్న కె.లక్ష్మణ్ తదితరులు


కాచిగూడ నింబోలిఅడ్డలో బీజేపీ జెండాను ఆవిష్కరించిన మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సుభాష్‌పటేల్ తదితరులు


రాంనగర్‌లో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు నరేష్ తదితరులు


బాగ్‌లింగంపల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థసారథి, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్ తదితరులు

బీజేపీ విజయంలో యువమోర్చా ప్రధాన భూమిక పోషించాలి

● కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయంలో యువమోర్చా ప్రధాన భూమిక పోషించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువతీ, యువకులు మోదీ పాలనను సమర్థిస్తున్నారని, వారి ఓట్లను రాబట్టడంలో యువమోర్చా ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన కోరారు. బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ నూతనంగా నియమితులైన సందర్భంగా శనివారం బర్కత్‌పురలోని నివాసంలో కిషన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ మెస్ బిల్లులను చెల్లించాలి

● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య శనివారం లేఖ రాశారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు సంవత్సరాల ఫీజుల బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని ఆయన తెలిపారు. హాస్టల్స్ కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో పరీక్ష సమయంలో హాస్టల్స్‌కు కరెంట్ కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారని, పరీక్షలు ఎలా రాస్తారని, దీని ప్రభావం పరీక్ష ఫలితాలపై ఉంటుందని ఆయన అన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు 3 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫీజులు రాకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వడం లేదన్నారు.


ఇఫ్తార్ విందులో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, డాక్టర్ మహ్మద్ వాసీమ్ తదితరులు

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిది

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీల సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకుని దయార మార్కెట్‌లోని ప్రోకేర్ పాలిక్లీనిక్ ఎండీ డాక్టర్ మహ్మద్ వాసీమ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమానికి పద్మారావుగౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, నాయకులు ముఠా జైసింహ, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ.. ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ పాటుపడిందన్నారు. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు వహెద్‌ఆలీ, మహ్మద్ ఇసాక్, జబ్బర్, ఏజాజ్ హాస్సేన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి జాతీయ బీసీ సంఘం మద్దతు



మాట్లాడుతున్న రాజేశ్వర్‌యాదవ్

బర్కత్‌పుర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. శనివారం కాచిగూడలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను 50 శాతానికి పైగా పెంచుతామని చెప్పడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్‌చారి, ఎం.కుమార్, పూసల సత్యనారాయణ, పండు, జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తే.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం

● ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అవుతుందని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. రిజర్వేషన్ల పరిమితిని 50 శాతానికి మించి అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని, దీని వల్ల ఆ పార్టీ మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణ పేదలకు అమలు చేస్తున్న 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఇతర వర్గాలకు కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రకటించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

ఈటలకు ఆరెకటిక సేవా సమితి మద్దతు

బర్కత్‌పుర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ ఆరెకటిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్యాణ్‌కార్ ఈశ్వర్ చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ బిడ్డ ఈటల గెలుపు కోసం బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడే ఈటెల రాజేందర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

పటేల్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ శనివారం డివిజన్‌లోని పటేల్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. బస్తీవాసులు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని తాను సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్మసేవ సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో శనివారం బాగ్‌అంబర్‌పేటలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో చలివేంద్రాన్ని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రమోహన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

\- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన మేయర్

● బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల, కార్పొరేటర్లు


మాట్లాడుతున్న బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల, కార్పొరేటర్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల చర్యలపై ఫోకస్ పెట్టిన మేయర్ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు ఆరోపించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎండాకాలంలో తాగునీటి కష్టాలు, నాలాల పూడికతీత పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మల్కాజిగిరి బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ ఎన్నికల పేరుతో పనులు చేపట్టకుండా కొంత మంది జీహెచ్ఎంసీ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జూన్ వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున నాలా పనుల్లో జాప్యం జరిగితే వర్షాకాలం ప్రజలు తీవ్ర ఇబ్బందుకు పడే అవకాశాలుంటాయన్నారు. కమిషనర్ స్పందించి ఎన్నికల కమిషన్ నుంచి అత్యవసర నాలా పనులకు అనుమతి తీసుకుని వెంటనే టెండర్లు పిలవాలని, మంజూరైన పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని, సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు అడిగినా ఇవ్వడం లేదని అన్నారు. చేసిన పనుల్లో అవినీతి, అక్రమాలు బయట పడుతాయని అధికారులు వివరాలు బయటికి చెప్పడం లేదంటూ విమర్శించారు. జీహెచ్ఎంసీ ముందున్న నాలాలో సిల్ట్ పేరుకుపోయిందని ఇక్కడే ఇలా ఉంటే గ్రేటర్ వ్యాప్తంగా నాలాల పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. పన్నుల వసూళ్లకు అడ్డురాని ఎన్నికల కోడ్, ప్రజా సమస్యలు తీర్చడంలో మాత్రం అడ్డొస్తుందా అంటూ ప్రశ్నించారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ ఎన్నికల ముందు గత ఎమ్మెల్యేలు హడావిడిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని ఆ పనులు నేటికి ప్రారంభం కాలేదని ఆరోపించారు.

మూసాపేట కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ భాగ్యనగరంలో చెరువులు, నాలాలు కాపాడుకోకుంటే 2020లో వచ్చిన పరిస్థితులు మళ్లీ వస్తాయంటూ హెచ్చరించారు. చీకటి జీవోలు రద్దుచేసి జోన్ మార్పు చేస్తూ ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు చేయండి

పంజాగుట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతికి ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా జీహెచ్ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే సహాడియోరావును పంజాగుట్ట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులతో కలిశారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పంజాగుట్టలోని అంబేడ్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లూ చేయాలని ఆయనను చెన్నయ్యతో పాటు కమిటీ సభ్యులు కోరారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని జోనల్ కమిషనర్ చెప్పారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వైస్‌చైర్మన్ బూర్గుల వెంకటేష్, పంజాగుట్ట అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ కుమార్, ప్రవీణ్, కుమార్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేతలు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్ల పేరిట విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని పీడీఎస్‌యు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నరసింహరావు, నరేందర్, పృథ్వీ, అఖిల్, సంధ్య, సాయి, సురేష్, సీతారాం, వెంకటేష్, అమర్, అజయ్, అనిల్, పవిత్ర, సతీష్ పాల్గొన్నారు



సదస్సులో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉచిత, నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వమే అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఐద్వా, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో 'ప్రజారోగ్యం- ప్రభుత్వ ఆస్పత్రులు' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణజ్యోతి, ఆశాలత, రత్నమాల, నాగలక్ష్మి, శశికళ, లక్ష్మమ్మ, షబానా, మస్తాన్, సాగర్, కిషన్, జావేద్, కృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు

'గృహజ్యోతి' వల్ల ఉద్యోగాలు కోల్పోయిన బిల్ కలెక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి

కవాడిగూడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం వల్ల సుమారు 650 మంది విద్యుత్ బిల్ కలెక్టర్లు ఉపాధి కోల్పోయారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి వి.గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.స్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రమేష్ మాట్లాడారు. గృహజ్యోతి పథకం వల్ల సుమారు 650 మంది బిల్ కలెక్టర్లు ఉపాధి పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్ కలెక్టర్లందరికీ లేబర్ కమిషనర్ ఇచ్చిన జీవో 11 ప్రకారం స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే 650మంది బిల్ కలెక్టర్లకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా డీఈ ఆఫీసులలో పనిచేయడానికి అవకాశం కల్పించి, కమిషనర్ ఇచ్చిన ఆదేశాలప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థ యాజమాన్యాం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు కృష్ణయ్య లక్ష్మయ్య, రమేష్, రాజేశ్వరి, ఆశాలత, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ట్యాంక్‌బండ్‌పై అన్నమాచార్య విగ్రహం వద్ద భక్తీగీతాలను ఆలపిస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభారాజు తదితరులు

భక్తిశ్రద్ధలతో మహానగర సంకీర్తన

కవాడిగూడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనలకు ప్రాచుర్యం కల్పించి ప్రతి ఒక్కరిలో భక్తి బావాన్ని పెంపొందించేందుకు తనవంతు వంతు కృషి చేస్తున్నట్లు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు అన్నారు. 521వ అన్నమాచార్య ఆరాధన(అన్నమాచార్య వర్ధంతి) ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య భావనా వాహిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి నగర సంకీర్తన ప్రారంభమై ఉదయం 7 వరకు ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వరకు డాక్టర్ శోభారాజు శిష్యబృందంతో భక్తి గీతాలు ఆలపిస్తూ చేరుకున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు అన్నమాచార్య భక్తిగీతాలను ఆలపించారు. మహానగర సంకీర్తన ప్రతి సంవత్సరం శోభారాజు శిష్య బృందం నిర్వహిస్తోందన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.


తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభకు తరలివెళ్లిన మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు

రామకృష్ణ మఠంలో వేసవి శిక్షణా శిబిరాలు

కవాడిగూడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ మఠానికి చెందిన వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ సంస్కార్ 2024 పేరిట నాలుగో తరగతి నుంచి పదోతరగతి చదివే విద్యార్థుల కోసం వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వహాకులు శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతి నుంచి ఏడో తరగతి చదివే విద్యార్థులకు జరిగే శిక్షణా శిబిరాలు ఈనెల 29 నుంచి ప్రారంభమై మే 10న ముగుస్తాయని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో సంబంధిత కోర్సు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నెంబర్ 9177232696లో సంప్రదించాలని లేదా రామకృష్ణమఠం కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద చెప్పారు.


మాట్లాడుతున్న శ్యాంసుందర్‌గౌడ్, సూర్యప్రకాష్‌సింగ్ తదితరులు

కిషన్‌రెడ్డిని విమర్శించే స్థాయి పద్మారావుకు లేదు

బర్కత్‌పుర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు లేదని పలువురు బీజేపీ నేతలు స్పష్టం చేశారు. శనివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు బి.శ్యామ్‌సుందర్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్‌లు మాట్లాడారు. సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించిన విషయం పద్మారావుకు తెలియదని వారు విమర్శించారు. ఓపెన్ జీమ్‌లు, కమ్యూనిటీహాల్స్ నిర్మించారని, గాంధీ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు కిషన్‌రెడ్డి సారథ్యంలోనే జరిగిందన్నారు. ఈ సమావేశంలో మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శులు సి.కె.శంకర్, మేకల సారంగపాణి, నాయకులు రవీందర్, సందీప్ సాయి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎంఆర్‌పీఎస్‌రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ తదితరులు

మాదిగలను ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్‌కు లేదు

కవాడిగూడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మాదిగలను ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని. ఆత్మగౌరవం ఉన్న మాదిగలెవరూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని ఆయన పిలుపునిచ్చారు. మాదిగలను ఓట్లు వేసే యాంత్రాలుగానే కాంగ్రెస్ పార్టీ బావిస్తోందని అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానం కూడా కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగలను ఘోరంగా అవమానించడాన్ని నిరసిస్తూ శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సిహెచ్ సోమశేఖర్‌మాదిగ, రాష్ట్ర సీనియర్‌నాయకులు ఏర్పుల విష్ణు మాదిగ, జిల్లా నాయకులు అజిత్ వాల్మీకి, కిషన్‌మాదిగ, శివమాదిగ. అరుణ్‌మాదిగ, అనిల్‌మాదిగ, రామకృష్ణ మాదిగ, రాజశేఖర్‌మాదిగ, శ్యామ్‌సన్‌మాదిగ, ఆదిత్యమాదిగ, సుజాత, సరోజ, ప్రశాంత్ మాదిగలతో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలి

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డీఎస్‌డీ దివ్యాంగుల సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్‌రావు, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డాక్టర్ డి.సుధాకర్‌బాబులను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తున్న లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు సంబంధించిన డిమాండ్‌లను చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కో-కన్వీనర్లు వి.భారతి, కె.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

అమీర్‌పేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువతిని మరో వాహనంపై వేగంగా వస్తున్న ఇద్దరు యువకులు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లాకు చెందిన ప్రశాంతి (24) నగరంలోని శివబాగ్‌కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. శనివారం మధురానగర్‌లో ఇంటర్వ్యూ ఉండడంతో ఉదయం 10 గంటలకు తన ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ యువతిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. యువతిని ఢీ కొట్టిన యువకుల వాహనం కూడా కింద పడిపోవడంతో ఒకరు గాయపడగా మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకొని ద్విచక్ర వాహనంతో పాటు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బైక్ అదుపు తప్పిఇద్దరికి..

బంజారాహిల్స్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కింద పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గచ్చిబౌలికి చెందిన సాకేత్‌కుమార్, కూకట్‌పల్లికి చెందిన సాయిరెడ్డి స్నేహితులు. ఇద్దరూ కలిసి ఈనెల 5న గచ్చిబౌలి నుంచి జూబ్లీహిల్స్ వైపు బైక్‌పై వెళ్తుండగా రోడ్డు నెంబరు-45 కెబుల్ బ్రిడ్జి దిగగానే వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిద్దరిని ఆస్పత్రికి తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.